ఛాంబర్ అధ్యక్షుడు మంగరాజు మృతి

ప్రజాశక్తి -పిఠాపురం

పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షులు, వెండి బంగారం డైమండ్స్ వర్తక సంఘం అధ్యక్షుడు గ్రంధి మంగరాజు (56) ఆదివారం మృతి చెందారు. మంగరాజు 14 ఏళ్లుగా ఛాంబర్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులుగా ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన చికిత్స పొందుతున్నారు. ఆయన మృతి పట్ల ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యులు, పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, మాజీ ఎంఎల్ఎ ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ ఎంపీ వంగా గీత ఆయన మృతికి సంతాపం తెలిపారు. మంగరాజు మృతికి సంతాపంగా సోమవారం పట్టణంలో అన్ని దుకాణాలు మూసివేస్తున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ కమిటీ సభ్యులు తెలిపారు.

కదిలొచ్చిన పసుపు దళం

జోరువానలోనూ కొనసాగిన బహిరంగ సభ
మొదటి విడత మ్యానిఫెస్టోను ప్రకటించిన బాబు
వాహనాలతో నిండిపోయిన జాతీయ రహదారి
ముగిసిన టిడిపి మహానాడు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి మహానాడులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు పసుపుదళం కదిలొచ్చింది. శనివారం రాత్రి నుంచే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో చేరుకున్నారు. కొత్తపేట, ఆత్రేయపురం, పెరవలి, గోపాలపురం, చాగల్లు నుంచి వేలాది సంఖ్యలో టిడిపి కార్యకర్తలు బైకులపై ర్యాలీగా సభా ప్రాంగణానికి వచ్చారు. ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల ముగింపు సభ కావడం, ఎన్నికల మేనిఫెస్టోను చంద్రబాబు ప్రకటించనున్నారని తెలియడంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు పోటెత్తారు. జోరువానను సైతం లెక్కచేయకుండా నాయకులు ప్రసంగాలను విన్నారు.

ఎంపీ రామ్మూర్తినాయుడు అధ్యక్షతన 4 గంటలకు సభ ప్రారంభమైంది. పలువురు నాయకులు ఒక్కొక్కరిగా ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, హిందూపురం ఎంఎల్ఎ, సినీనటుడు నందమూరి బాలకృష్ణ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో సైకో పాలనను అంతమొందించి సైకిల్ పాలనను తీసుకురావాలన్నారు. దీని కోసం ప్రతి కార్యకర్తా సైనికునిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మొదటి విడత మేనిఫెస్టోను ఆయన ప్రకటించారు. ఆడబిడ్డకు ప్రతి నెలా రూ.1,500, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు ఏడాదికి రూ.20వేల సాయం, నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3వేల భృతి, పూర్ టు రిచ్ వంటి పథకాలను ఆయన వివరించారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.

జాతీయ రహదారిపై కొనసాగిన రద్దీ

మహానాడు సభ నిర్వహణ నేపథ్యంలో ఆదివారమూ జాతీయ రహదారిపై రద్దీ నెలకొంది. ఉదయం 8గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ప్రైవేట్ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో పాటు కాలినడకన సైతం తరలి వచ్చారు. జిల్లా పోలీసు అధికారులు సుమారు 25 వేల వాహనాలు వస్తాయని అంచనాలు వేశారు. అంచనాలకు తగ్గట్లుగా 10 పార్కింగ్ స్థలాలు అందుబాటులోకి తెచ్చారు. ఆయా పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిలిచిపోవటంతో అత్యధిక మంది జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలను నిలిపి సభాస్థలానికి తరలివచ్చారు. జిల్లా ముఖ ద్వారాలలోతో పాటు సభా ప్రాంగణం సమీపంలోని ప్రతినిధుల సభ జరిగిన స్థలంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. దీంతో భోజనం చేసిన అనంతరం కార్యకర్తలు చెట్ల నీడన విశ్రాంతి తీసుకున్నారు.

బహిరంగ సభకు తరలొచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తల, (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

సభా ప్రాంగణానికి బయలు దేరిన చంద్రబాబు కాన్వాయ్ ట్రాఫిక్‌లో 30 నిమిషాల పాటు చిక్కుకుంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు, వారి వాహనాలతో జాతీయ రహదారి నిండిపోయింది. ఈ సమయంలో గాలి దుమారం రేగడం, జోరువాన పడటంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలిగింది. దీంతో చంద్రబాబు కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తూ చంద్రబాబు కాన్వాయ్‌న ప్రాంగణం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం చంద్రబాబు బహిరంగ సభలో ప్రసంగించారు.

వేదికపై ఆశీనులైన నాయకులు

వర్షంలో అభిమానుల విజయ సంకేతం

కార్యకర్తలతో నిండిపోయిన జాతీయ రహదారి

కాకినాడలో ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మాన్యువల్ ఉద్యోగోన్నతుల కోసం ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను ఆన్‌లైన్‌లో కాక మాన్యువల్‌గా చేపట్టాలని ఎపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో కో కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.నాగమణి, బి.శరత్, వెంకట్ రాజు, ప్రభాకర్ వర్మ మాట్లాడారు. ఈ నెల 17న మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల్లో అన్ని రకాల ఉపాధ్యాయ పదోన్నతులను మాన్యువల్‌గా జరపడానికి హామీ ఇచ్చారని, కానీ భిన్నంగా ఉపాధ్యాయుల ప్రమోషన్లు మాన్యువల్‌గా కాక ఆన్‌లైన్‌లో జరపడానికి అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఖాళీలు ఎక్కడ ఉన్నాయో చూపకుండా ప్రమోషన్లు వద్దనుకునేవారు రాతపూర్వకంగా అన్‌విల్లింగ్ తెలపాలని ఆంక్షలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో విధానానికి ఈ ప్రక్రియకు పూర్తి భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ప్రమోషన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. 2022 జూలైలో ఒకసారి 2023 జనవరిలో మరోసారి ప్రమోషన్లు ఇస్తామని ఉపాధ్యాయుల నుండి విల్లింగ్ తీసుకున్నారన్నారు. ప్రమోషన్ల వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని అది తేలిన తర్వాతే ప్రమోషన్లు ఖరారు చేస్తామని నమ్మించి రూ.2500 అలవెన్స్‌తో నాలుగు నెలలు పని చేయించుకున్నట్లు తెలిపారు. కానీ మొత్తం ప్రమోషన్ కౌన్సిలింగ్ రద్దుచేసి అందరికీ నిరాశ కలిగించారన్నారు. ఇప్పుడు ఎటువంటి ఖాళీలు చూపకుండా విల్లింగ్ ఇచ్చిన వారికే ప్రమోషన్లు కల్పిస్తామని అధికారులు చెపుతున్నారన్నారు. ఎంఇఒ-2 ప్రమోషన్ల షెడ్యూల్‌ను కూడా ఇంతవరకు ప్రకటించలేదన్నారు. అధికారుల తీరు ద్వారా అనేకమంది ఉపాధ్యాయులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిఇఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.కాశీవిశ్వనాథం, ఎం.శ్రీనివాస్, సిహెచ్.రవి, కె.రామచంద్రరావు, ఎన్.గోవిందరాజులు, భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం కాకినాడలో కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుంచి స్పందన జరుగుతుందని, అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ అంశాన్ని గమనించాలని కలెక్టర్ కోరారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-గండేపల్లి, కరప

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలను పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. గండేపల్లిలో టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు, ఎలమటి కాశీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలేసి నివాళ లర్పించారు అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, కోర్పు సాయి తేజ, వెంపటి రాజు, ఆళ్ల సత్తిబాబు, విప్పర్ల బాబి పాల్గొన్నారు. మురారిలో పార్టీ గ్రామ అధ్యక్షుడు సుంకవల్లి రాజు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గురజాల వెంకన్న దొర ఉండవల్లి శీను గద్దె అబ్బన్న పాల్గొన్నారు

కరప మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మీ సత్యనారాయణ మూర్తి పూలమాలలు వేసి కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మహేంద్రబాబు, రెడ్డి సత్యనారాయణ, మద్దూరి స్వామి, గంటా వీరన్న చౌదరి, వై.సుకుమార్, పులపకూర శుభామహేష్, పంపన కన్నారావు, కె.సురేష్ పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్** కాకినాడ రూరల్ వలసపాకలులో నటరత్న కళామందిర్‌లో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకలపూడి సూర్యారావుపేటలో గల జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తమ మార్కులు వచ్చిన ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురకు బహుమతులు, నగదు పురస్కారాన్ని అందజేశారు. కళాకారులకు పురస్కారాలు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు, తిక్కని సుబ్బారావు, తురగా సూర్యారావు, గోవిందరావు, మహేష్, దాశరద్ పాల్గొన్నారు.

గండేపల్లిలో జయంతిలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

దంత సంరక్షణపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరు దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నక్షత్ర దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ జమ్మి శిరీష అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఆదివారం ఆమె విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. క్యాంపు కో-ఆర్డినేటర్ రొంగల అరుణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిల్లలు ఏమి తిన్నా సరే నీటితో నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూనిరెడ్డి అరుణ, మంజుల, అమత, నమ్రత, సూరజ్, ఐశ్వర్య, సందీప్, దారపురెడ్డి కృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం, ఈదురుగాలుల బీభత్సం

పలుచోట్ల కూలిన భారీ వృక్షాలు

రోహిణి కార్తె ప్రభావంతో తీవ్రమైన ఎండలు కాస్తున్నా ఆదివారం సాయంత్రం జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అకాశం మబ్బులు కమ్మి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల దాటికి పలుచోట్ల భారీ వృక్షాలు కూలిపోయాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

సామర్లకోట రూరల్ సామర్లకోట పట్టణం, మండల పరిధిలో పలు చోట్ల రహదారులు భవనాలపై భారీ వృక్షాలు కూలిపడి ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేట్లపాలెం కెనాల్ రోడ్డులో ఈదురు గాలుల దాటికి బారీ వృక్షం నేలకూలి రోడ్డుకు అడ్డుగా పడింది. ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం ఏర్పడంతో సిఐ కె.దుర్గాప్రసాద్, ఎస్ఐ గరగారావు సరిదిద్దారు. సామర్లకోట రైల్వే గేటు వద్ద విశాఖపట్నం వెళ్ళే రైల్వే విద్యుత్ లైన్లపై భారీ దూది వృక్షం కూలిపడింది. దీంతో రైల్వే లైన్ విద్యుత్ సరఫరా నిలుపుదలచేసి విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. వర్షం అనంతరం రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన చెట్టు కొమ్మలను తొలగించే ఏర్పాటు చేశారు. తదుపరి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగా అప్పటివరకు విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది ప్రత్యామ్నాయంగా రెండవ నెంబర్ లైన్ మీదగా అధికారులు విశాఖ వైపు రైళ్లను మళ్ళించారు. గాంధీ బొమ్మ సెంటర్ నూకాలమ్మ తల్లి గుడి ఎదురుగా రైల్వే క్వార్టర్స్ వద్ద పార్క్ చేసి ఉన్న కారుపై భారీ వృక్షం పడడంతో కారు ముందు భాగం ధ్వంసం అయ్యింది. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌పై చెట్టు కూలడంతో అంతరాయం ఏర్పడింది. స్థానిక మెహర్‌కాంప్లెక్స్ పోస్టాఫీసు ఎదురుగా విద్యుత్ స్థంభం విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా పానీపూరీ బండిపై చెట్టుకొమ్మ విరిగిపడింది. బ్రౌన్‌పేటసెంటర్ దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద భారీ వృక్షం విరిగి పడింది. సామర్లకోట జయలక్ష్మీటాకీటసు సమీపంలో రేకుల షెడ్డుపై వృక్షం కూలిపడింది. స్థానిక రైల్వే ఒవర్ బ్రిడ్జిపై భారీ హోర్డింగ్ కూలిపోయింది.

భారీ ఈదురు గాలులతో కూడిన వర్షంతో సామర్లకోట మండల పరిధిలో 10కి పైగా విద్యుత్ స్తంభాలు గ్రామాల్లో కూలిపడ్డాయి. పట్టణ పరిధిలో విద్యుత్ స్తంభాలపై చెట్లు పడి కూలినట్లు టౌన్ ట్రాన్స్‌కో ఎఇ రమేష్ కుమార్, రూరల్ ఎఇ చెప్పారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఆదివారం అర్ధరాత్రి 1గంట దాటినా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడతామని వారు వివరించారు.

పెద్దాపురంలో సాయంత్రం ఒకేసారి ఈదురు గాలులతో కూడిన వర్ష బీభత్సంతో అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. దర్గా సెంటర్ పరిసర ప్రాంతాలలో షాపుల రేకులు పైకి ఎగిరిపోయాయి. వడ్లమూరు రహదారిలో పెద్ద రావి చెట్టు దుర్గమ్మ గుడి, పాండురంగడు ఆలయాలపై కూలడంతో ఈ ఆలయాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వరహాలయ్యపేట, నువ్వులగుంట వీధి ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. పెద్దాపురం మండల పరిధిలో ప్రత్తిపాడు రహదారిలో దివిలి, చంద్రమాంపల్లి, పులిమేరులో చెట్లు నేల కూలడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక తలుపులమ్మ కాలనీ సమీపంలో తాడిచెట్టు విరిగి హై టెన్షన్ వైర్లు పడటంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోవటంతో హై టెన్షన్ వైర్లు నేలకూలాయి. **పెదపూడి** మండలంలో ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షంతో పలు గ్రామాల్లో రోడ్డుకిరువైపులా చెట్లు నేలకొరిగాయి. ఎస్ఐ పి.వాసు, సిబ్బంది తొలగించారు. పెద్దాడ గ్రామం నుంచి పెదపూడి, దోమాడ, కరకుదురు గ్రామాల మధ్యల ఆరుచోట్ల రోడ్డుకు రెండు వైపుల ఉన్న చెట్లు నేలకొరిగాయి. దీంతో పైన కాకినాడ ఆర్అండ్ బి రోడ్డులో ప్రజల రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్దాడ గండ్రేడు మధ్య రహదారిలో చెట్లు కరెంటు స్తంభాలు నేలకొరిగాయి

పెదపూడిలో..

సామర్లకోట రైల్వే లైన్‌పై పడిన చెట్టు

పెద్దాపురంలో..

కార్టూ'నిజం'

ఉత్సాహంగా వేసవి క్రీడలు

సమ్మర్ స్పోర్ట్స్‌లో భాగంగా పలుచోట్ల నిర్వహిస్తున్న క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి -యంత్రాంగం

కరప మండలం వేళంగిలో జెడ్‌పి ఉన్నత పాఠశాల మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. శీల, వాకాడ-2 మధ్య జరిగిన మ్యాచ్‌లో శీల టీం విజయం సాధించింది. అండర్ 19 మ్యాచ్‌లు వర్షం కారణంగా వాయిదా వేసినట్లు నిర్వాహకులు నక్కెళ్ల వేణుగోపాల్, షేక్ లాలిబాబు, అప్పికొండ దుర్గాప్రసాద్, వై.విక్రమ్, చప్పిడి మూర్తి, చేగొండి సూర్య, జాజి, అఖిల్ తెలిపారు. **తాళ్లరేవు** కోరంగి పంచాయతీ చిన్న బొడ్డు వెంకటాయపాలెంలో సామాజిక కార్యకర్త కర్రి నూకరాజు నిర్వహించిన కెఎన్ఆర్ వాలీబాల్ టోర్నీలో జి.వేమవరం జట్టు విజేతగా నిలిచింది. 12 జట్లు పాల్గొన్న ఈ పోటీలల్లో జి.వేమవరం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా పెదవలసల జట్టు ద్వితీయ స్థానాన్ని, చినవలసల జట్టు తృతీయ స్థానాన్ని గెలుచుకుంది. ఈ పోటీలను చూడడానికి మండలంలోని పలు ప్రాంతాల నుంచి యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు వాలీబాల్, నెట్‌లను కర్రి నూకరాజు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్లు రేకాడి దుర్గాప్రసాద్, మహాలక్ష్మి, దోమ దుర్గాప్రసాద్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. **పిఠాపురం** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ పురుషుల రెండో రోజు రగ్బీ పోటీలను మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ తనయుడు గిరీష్ కుమార్ వర్మ ప్రారంభించారు. ఆదివారం క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు జరిగాయి. పురుషుల విభాగంలో తూర్పు గోదావరి, నెల్లూరు జట్లు, మహిళా విభాగంలో విజయనగరం, నెల్లూరు జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రగ్బి అసోషియేషన్ అధ్యక్షులు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, షైన్ హాస్పిటల్ డాక్టర్ సిద్ధార్థ, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ఎపి ఫెన్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగం సతీష్ బాబు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పద్మనాభం, ఎపి రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి బి.రామాంజనేయులు, సతీష్, వంశీ, సాయి, అఖిల్ పాల్గొన్నారు.

పిఠాపురంలో రగ్బీ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

విద్యార్థులకు వినోదంతో విజ్ఞానం

వేసవి శిబిరాల్లో భాగంగా ఆదివారం పలుచోట్ల విద్యార్థులకు వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

కరప వేసవి వినోదంలో విద్యార్థులు విజ్ఞానాన్ని సమకూర్చుకుంటున్నారని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీ రామారావు అన్నారు. వాకాడలో 22 రోజులుగా నిర్వహిస్తున్న వేసవినోదంలో భాగంగా ఆదివారం గణితంలో మెళకువలు, ఒరిగామి, సైన్స్ ప్రయోగాలు, పప్పెట్రీ, కథలు చెప్పించడం, మ్యాజిక్ నేర్పించడం, భాషాంశాలు మొదలైన అంశాలతో విద్యార్థులు విజ్ఞానం, వికాసం, వినోదంతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ నిర్వహణ జరుగుతుంది. ఈ కార్యక్రవమంలో గ్రామ సర్పంచ్ అడబాల సత్య ప్రసాద్, విద్యాభిలాషి ఆకుల బాపనయ్య పాల్గొన్నారు. **పెద్దాపురం** గ్రంథాలయంలో కోటపాడు ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు స్పోకెన్ ఇంగ్లీష్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సామర్లకోట తెలుగు పండిట్ ఎం.రిషికుమార్ తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పాటల పాడటంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మాధవపట్నం జమునానగర్ కాలనీ అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో అంగర గోపాలకృష్ణ అధ్యక్షతన విద్యార్థులకు చిత్రలేఖనంపై తరగతులు నిర్వహించారు. డ్రాయింగ్ ఆర్టిస్టు పి.వీరబాబు పాల్గొన్నారు.



కరపలో శిబిరంలో మాట్లాడుతున్న జెవివి నేత శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

టిప్పర్, ట్యాంకర్ ఢీకొని మంటలు

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎడిబి రోడ్డు పాండవుల మెట్ట సెంటర్ వద్ద ఆదివారం ఎదురెదురుగా టిప్పర్, ఇథనాల్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో టిప్పర్‌లో మంటలు చెలరేగి టిప్పర్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. మహారాష్ట్ర నుంచి కాకినాడ ఇథనాల్ తీసుకుని వెళుతున్న ట్యాంకర్, సామర్లకోట నుండి రాజమండ్రి వెళ్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్‌లోని ఆయిల్ ట్యాంకర్‌కు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. టిప్పర్ డ్రైవరు స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించారు. పెద్దాపురం, జగ్గంపేట అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను ఆర్పి వేశాయి. ఈ ప్రమాదంలో ఇథనాల్ ట్యాంకర్‌కు ఏ విధమైన ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న సిబ్బంది

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

రాగంపేటలో ఆదివారం ఇన్‌ఛార్జి ఎస్ఇబి సిఐ కెవి.స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-మండపేట

మండపేటకు చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి అదృశ్యంపై పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన గొలుగూరి వెంకటకోదండ రామారెడ్డి ఈ నెల 25న రైతుకు సొమ్ములు ఇచ్చేందుకని ఇంటి నుంచి బయలుదేరాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాకపోవడంతో భార్య శ్వేతనాగదేవి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు గురువారం అర్ధరాత్రి సమయంలో కేసు నమోదు చేశారు. కాగా వెంకటరామారెడ్డి మోటారు సైకిల్‌ను శనివారం మండపేట బైపాస్ రోడ్డులో గుర్తించినట్టు సమాచారం. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఆరోగ్యంపై మహిళలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మహిళలు, బాలికలు శరీర ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని పెద్దాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జగదాంబ, డాక్టర్ సుదీప్తి, డాక్టర్ లావణ్య అన్నారు. అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, మెప్మా సిఎం ఎం.వెంకటలక్ష్మి అధ్యక్షతన పట్టణ పరిధిలోని వివిధ కళ్యాణ మండపాల్లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు రుతుస్రావ సమస్యలు, శానిటరీ పాడ్స్ వినియోగంపై మహిళలకు, బాలికలకు అవగాహన కల్పించారు. పలు వార్డుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో ఆయా వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు ఐబి స్పెషలిస్ట్ మోహన్ కుమార్,మెప్మా సిఒలు సల్మా, శ్రీదేవి, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అమలాపురం

పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ సేవకులు నల్లా శ్రీధర్ సౌజన్యంతో హైదరాబాద్ ఏషియన్ వాసిక్యులర్ ఆస్పత్రి వారు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనసేన పార్టీ నాయకులు డియంఆర్.శేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు రోగులకు ఉచితంగా పరీక్షలు జరిపారు. ఆస్పత్రి యాజమాన్యం మాట్లాడుతూ ప్రజలకు రక్త నాళాల సమస్యలపై అవగాహన కల్పించి, ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని మేము ముందుకు రాగానే మాకు అన్ని విధాల సహకరించిన నల్లా శ్రీధర్ కికతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, పడాల నానాజీ, ఆర్‌డియస్.ప్రసాద్, నల్లా బుజ్జి, దున్నాల బాబీ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యమందేలా ఒపి

జిజిహెచ్ సూపరింటెండెంట్ హేమలతాదేవి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖ జిల్లా ప్రజలకూ ఆరోగ్య ప్రదాయినిగా సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రోగులకు మరింతగా మెరుగైన వైద్యసేవలందేలా ఒపి సేవలను విస్తత పరిచామని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అభివద్ధికి చర్యలు చేపడుతున్నట్లు 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వివరించారు. రోగులకు సత్వరం మెరుగైన వైద్య సేవల్ని అందించేందుకు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు.

ఈవినింగ్ ఒపి సేవలు కూడా మొదలు పెట్టారా..?

ఇప్పటివరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఒపి సేవలు అందేవి. ఇకనుంచి మధ్యాహ్నం తర్వాత 3 నుంచి 4 గంటల వరకు కూడా అన్ని విభాగాల్లోని ఈ సేవలు అందిస్తున్నాం. ఈవినింగ్ ఓపీ సేవలు పెంచడం ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది.

ఎటువంటి ప్రయోజనాలు పొందుతారు.?

దూర ప్రాంతాలకు చెందిన రోగులకు ఈ సౌకర్యం బాగా ఉపయోగపడుతుంది. పలు సందర్భాల్లో రావడం ఆలస్యం కావడం వల్ల ఆ రోజు నిరాశ చెందే పరిస్థితి ఉండేది. ఇకనుంచి అటువంటి ఇబ్బందులు లేకుండా ఒపి సేవలు అందుతాయి. క్యూలలో ఇబ్బందులు పడకుండా ఎంత సమయం అయినా నిలుచుని సంబంధిత వైద్యుడికి చూపించుకుని వెళ్లే వెసులుబాటు కలిగింది. దీర్ఘకాలిక రోగులు రక్త పరీక్షలు చేసుకుని అదే రోజు ఫలితాలు తీసుకుని వైద్యుడికి చూపించుకుని మందులు తీసుకుని ఇళ్లకు వెళ్లే అవకాశం ఏర్పడింది.

ఏ విధంగా సేవలు అందుతున్నాయి.?

ప్రతిరోజు మూడు వేలకు మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. అత్యవసర విభాగాల్లో క్షతగాత్రులకు వెనువెంటనే వైద్య సేవల్ని అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా జారీ అయ్యేలా చర్యలు తీసుకున్నాం. చివరి పేషెంట్‌ను కూడా చూసి వెళ్లే లాగా వైద్యులను అందుబాటులో ఉంచుతున్నాం.

ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి.?

రెండేళ్లుగా ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు యంత్రం పాడవడం వల్ల నిలిచిపోయాయి. త్వరలో కొత్త మిషన్ అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే నిధులు మంజూరయ్యాయి. సుమారు రెండు నెలలు లోపు ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. కీలకమైన సిటి స్కాన్ పరీక్షలు సక్రమంగానే జరుగుతున్నాయి. రోజుకు 70 నుంచి 100 స్కానింగ్‌లు నిర్వహిస్తున్నాం. సకాలంలో రిపోర్టులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఏయే సదుపాయాలు మెరుగు పడ్డాయి..?

కార్డియాలజీ వైద్యుని అందుబాటులో ఉంచాం. అత్యవసర విభాగంలో ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ కూడా అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. త్వరలోనే యాంజియోగ్రామ్ చేసే ల్యాబ్ అందుబాటులోకి రానుంది. సురక్షితమైన తాగునీరు, ఆహారం అందిస్తున్నాం. విద్యుత్ కోతల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జనరేటర్లను ఏర్పాటు చేశాము.

మహానాడుకు తరలిన నాయకులు

సామర్లకోట రూరల్ నుంచి వెళుతున్న మహిళలు

ప్రజాశక్తి - తాళ్లరేవు, సామర్లకోట రూరల్

రాజమండ్రిలో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు తాళ్లరేవు మండలం నుండి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. సుంకరపాలెం జంక్షన్‌లో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ' వాడ్రేవు వీరబాబు, కట్టా త్రిమూర్తులు, దూలిపూడి వెంకటరమణ, పిల్లి సత్తిబాబు, కల్కి మూర్తి, వరదరాజు, జక్కల ప్రసాద్ బాబు, మోర్త భైరవమూర్తి, వాసంశెట్టి శ్రీనివాస్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు నుంచి మహానాడుకు వెళుతున్న నాయకులు

సామర్లకోట మండలం హుస్సేన్‌పురం నుంచి చల్లా బుజ్జి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ మహానాడుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని తెలిపారు.

ధ్వంసమవుతున్న ఉప్పాడ బీచ్ రోడ్డు

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

అలల తాకిడికి ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు ధ్వంసం అవుతోంది. ఆ దారి గుండా ప్రయాణిస్తే ప్రమాదాలు తప్పడం లేదు. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. బీచ్ రోడ్డు ధ్వంసం అయినచోట కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. ఉప్పాడ, కాకినాడ బీచ్ రోడ్డు గుండా అనేకమంది వాహనదారులు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. విద్యార్థులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు సుమారు 2000 మంది పైబడి జిల్లా కేంద్రమైన కాకినాడకు పనుల నిమిత్తం వెళుతుంటారు. రోజురోజుకూ కోతకు గురవడంతో పక్కన వేసిన మట్టి సైతం కొట్టుకు పోతోంది. దీంతో ఆ రోడ్డుగుండా ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. ఈ బీచ్ రోడ్డు గుండానే అతి భారీ వాహనాలు సైతం ఫిషింగ్ హార్బర్‌కు వెళ్తుండడంతో వాహనదారులు మరింత ఇబ్బందులు గురవుతున్నారు. అటుపక్క పర్యాటకులు సముద్ర సోయగాలను వీక్షించేందుకు అనేకమంది నిత్యం వస్తుండడంతో ట్రాఫిక్కు అంతరాయం కూడా కలుగుతోంది. రోడ్డు ధ్వంసమైనచోట సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన బీచ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ధ్వంసం అవుతున్న బీచ్ రోడ్డు

యానాం వార్తలు

బోగస్ ఓట్లను తొలగించాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి, కరైకల్, మాహే, యానాంలో ఉన్న బోగస్ ఓట్లను తొలగించాలని దరియాలతిప్ప విలేజ్ హెడ్ మెన్స్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ సబ్బతి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత ప్రభుత్వ హోమ్ సెక్రటరీ న్యూఢిల్లీకి వినతిపత్రం అందించారు. ఈ బోగస్ ఓట్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని, యానాంలో అన్ని పోలింగ్ బూత్‌లలో సుమారు 3400 బోగస్ ఓట్లను బూత్ లెవెల్ అధికారులు గుర్తించారని, ఇటు యానాం అటు ఇతర రాష్ట్రాల్లో ఓట్లను కలిగి ఉన్నారని వాటిని తక్షణమే తొలగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. యానాంలో కొంతమంది రాజకీయ నాయకులు, అధికారులు బోగస్ ఓటర్లను ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేస్తూ బోగస్ ఓటర్లు రేషన్ ఇతర ప్రయోజనాలను పొందుతున్నారని వారికి అధికారులు ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే బోగస్ ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వైస్ ప్రిన్సిపల్ వి.చిత్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు పదోతరగతి పాస్ మార్కుల లిస్టు, టిసి, బ్యాంక్ పాస్ బుక్, రెసిడెన్స్ సర్టిఫికెట్, ఆధార్, కులధ్రువీకరణ పత్రం తదితర జిరాక్స్‌లు జత చేయాలన్నారు. దరఖాస్తులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేశాక వచ్చే నెల 9వ తేదీలోగా కళాశాలలో సమర్పించాలని కోరారు.

కనకాలపేటలో నేలకొరిగిన కొబ్బరి చెట్టు

ఈదురు గాలుల బీభత్సం

ప్రజాశక్తి - యానాం

యానాంలో ఆకాశం మేఘావతమై ఈదురు గాలులు బీభత్సం సష్టించాయి. గాలుల తీవ్రతకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి, విద్యుత్ తీగలపై చెట్లు విరిగి పడడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన మరమ్మత్తు పనులు చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఏడిదలో గడ్డి మేటు దగ్ధం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద గ్రామంలో బి.వీర్రాజుకు చెందిన మూడు ఎకరాల గడ్డిమేటు దగ్ధమయింది. ఆదివారం కొబ్బరిమట్ట విద్యుత్ వైరు పైపడటంతో ప్రక్కనే ఉన్న మూడు ఎకరాల గడ్డి దగ్ధం కాగా రూ.20 వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి హనుమంతరావు తెలిపారు.

ఘాటెక్కిన అల్లం, వెల్లుల్లి ధరలు

ప్రజాశక్తి- మండపేట

మార్కెట్లో అల్లం, వెల్లుల్లి ధరలు ఘాటెక్కాయి. గత మూడు నెలల వరకు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోఉన్న అల్లం, వెల్లుల్లి ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నట్టుతున్న నేపథ్యంలో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో అల్లం ధర కిలో రూ.30 నుంచి రూ.50 వరకూ పలికేది. ప్రస్తుతం రూ.200 నుంచి రూ.250 పలుకుతోంది. గతంలో వెల్లుల్లి కిలో ధర రూ.40 నుంచి రూ.60 వరకూ పలికేది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కిలో రూ.120 నుంచి రూ.180 వరకూ పలుకుతోంది. దీంతో చాల మంది కూరల్లో వెల్లుల్లి, అల్లం వినియోగాన్ని తగ్గించారు.

రెస్టారెంట్ల నిర్వాహకులు గగ్గోలు..

కొంతకాలంగా మండపేట, గ్రామీణ ప్రాంతాల్లో రెస్టారెంట్ల సంఖ్య పెరిగిపోతోంది. ఫలితంగా అమ్మకాలు ఖర్చులు పెరుగుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు దారుణంగా పెరగడంతో తాము నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రెస్టారెంట్ల నిర్వాహకులు వాపోతున్నారు.

మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన అల్లం, వెల్లుల్లి

అల్లం, వెల్లుల్లి ధరలు పెరిగాయి

కొంతకాలం క్రితం వరకు అందరికీ అందుబాటులో ఉన్న అల్లం, వెల్లుల్లి ధరలు అమాంతంగా పెరిగాయి. ప్రతి రోజూ వంటింట్లో ఏదోరకంగా వీటి వినియోగం తప్పనిసరి. -ఆర్.లక్ష్మి, గృహిణి, మండపేట

ధరలను తగ్గించాలి

నిత్యం అన్ని వంటకాల్లో వినియోగించే అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. పెరిగిన ధరలను తగ్గించేందుకు చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. -కె.రామలక్ష్మి, గృహిణి, మండపేట

రాత్రీపగలూ ముమ్మరంగా వరి కోతలు

హార్వెస్టర్ల రాకతో వేగంగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన వరి కోత యంత్రాల వల్ల రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో బెంబేలెత్తిన రైతులు ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో హార్వెస్టర్ సాయంతో రాత్రీ.. పగలూ వరికోతలు నిర్వహిస్తున్నారు. దీంతో వ్యవసాయ కూలీల కొరత తగ్గటమే కాక రోజుకు ఒక హార్వెస్టర్తో పది ఎకరాలు పైగా కోతలు కోయడంతో వ్యవసాయ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక హార్వెస్టర్లకు లైట్లు కూడా ఏర్పాటు చేయడంతో రాత్రి సమయంలోను వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతంలో సంప్రదాయ వరి కోతలు పగటిపూట మాత్రమే కొనసాగేవి. హార్వెస్టర్ వినియోగంతో రాత్రి సమయంలోను వరి కోతలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మరోవైపు రైతులకు హార్వెస్టర్లు రాకతో వరి కోత, పనులు కట్టుబడి కుప్ప నూర్చడం, ఎగరబోత వంటి పనులన్నీ కలిసి వస్తున్నాయి. హార్వెస్టర్లతో కూసిన ధాన్యం ఒకేసారి బయటకు రావడంతో రైతులకు పెద్ద ఎత్తున కూలి పనులు కలిసి వస్తున్నాయి. దీంతో దాల్వా వరి కోతలకు హార్వెస్టర్ల డిమాండ్ బాగా పెరిగింది. ఇదే ఆ విధంగా వరి కోత యంత్రాలు యజమానులు ఎకరాకు 2500 ఉండే ధరను 3000కు పెంచారు అయినప్పటికీ రైతులు వేగంగా పనులు జరగాలనే ఉద్దేశంతో హార్వెస్టర్లనే ఉపయోగిస్తున్నారు. ఎకరాకు రూ.8 నుంచి రూ.10వేలు ఖర్చు అయ్యే రైతులకు హార్వెస్టర్లతో రూ.మూడు వేలు చెల్లిస్తే సరిపోతుంది. దీంతో హార్వెస్టర్ల డిమాండ్ పెరగడంతో పాటు వాతావరణ ప్రభావం లేకుండా రాత్రి సమయాల్లోనూ కోతలు ముమ్మరంగా కొన సాగు తున్నాయి. సుమారు 70 శాతం వరి కోతలు పూర్తి కావడంతో మరో వారం రోజుల్లో నూరు శాతం వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు రైతులు తెలియజేస్తున్నారు.

రాత్రి సమయంలో కోత కోస్తున్న హార్వెస్టర్

నిలిచిన రోడ్డు పనులతో అవస్థలు

త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయాణికుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-మండపేట

మండపేట - ద్వారపూడి రోడ్డు పనులు సుమారు ఐదు నెలలుగా నిలిచిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు ఎప్పుడు బాగుపడుతుందో తమ కష్టాలు ఎప్పటికి తొలగుతాయయని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఈ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా సిసి రోడ్డు పనులు అరకొరగా చేసి మధ్యలోవదిలేశారు. దీంతో అటువైపు రాకపోకలు సాగించే వారంతా అష్టకష్టాలు పడుతున్నారు. సెంట్రల్ రోడ్డు ఫండ్ నిధులు రూ.12.50 కోట్ల వ్యయంతో తాపేశ్వరం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి గ్రామంలో 400 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మాణం ప్రస్తుతం ఉన్న రోడ్డును ఏడు మీటర్ల మేర విస్తరించేందుకు వీలులేకపోవడం, దానికి తగిన ప్రభుత్వ స్థలం లభ్యంకాకపోవడంతో 5 మీటర్ల మేర మాత్రమే సిసి రోడ్డు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు తాపేశ్వరం-ఇప్పన పాడు మధ్య సిసి రోడ్డు 1850 మీటర్ల మేర పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 700 మీటర్ల మేర మాత్రమే సిసి రోడ్డు పూర్తికాగా, అందులో ఒకపక్క మాత్రం 100 మీటర్లు వేసి, మరోపక్క పనులు చేయకుండా వదిలేశారు. దీంతో నిత్యం వాహనాలు రాకపోకలతో బిజీగా ఉండే తాపేశ్వరం-ద్వారపూడి రోడ్డుపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నారు. అలాగే ఈ రహదారిలో రోడ్డు మధ్యనున్న నాలుగు కల్వర్టులు, సిసి డ్రెయిన్లల పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పనపాడు- ద్వారపూడి మధ్య సిసి రోడ్డు 7 మీటర్ల మేర నిర్మాణ పనులు పూర్తిచేయగా రోడ్డుకు అదనంగా మార్జిన్ రెండు మీటర్ల మేర పెంచి మొత్తం 9 మీటర్లు పెంచారు. ఇక తాపేశ్వరం ఆంజనేయ స్వామి ఆలయం నుంచి తాపేశ్వరంలో మాత్రం సిసి రోడ్డు పెంపునకు స్థల కొరతతో పాత రోడ్డునే నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు రోడ్డు పనులు మాత్రం కేవలం బీటీ రోడ్డు పూర్తికాగా, సిసి రోడ్డు పనులు మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. మరోపక్క సిసి డ్రెయిన్, కల్వర్టులు పనులు ఇప్పటి దాకా ప్రారంభించలేదు. దాంతో అసలు ఈ సిసి రోడ్డు పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. మరోపక్క రోడ్డు పనులు పూర్తి కాకుండానే ట్రాఫిక్ కూడా వదిలేశారు. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోపక్క సదరు కాంట్రాక్టర్‌కు రోడ్డు బిల్లుల చెల్లింపు జాప్యంతో పనులు నిలిచిపోయాయని పలువురు అంటున్నారు.

ఎండ కాస్తే దుమ్ము లేచిపడుతుండగా వర్షం వస్తే ఈ రోడ్డు బురద మయంగా మారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇప్పటికి రూ.4 కోట్ల మేర పనులు జరిగాయి

ఈ విషయంపై రోడ్డు భవనాల శాఖ జెఇ సూర్యనారాయణను వివరణ కోరగా రూ.12.50 కోట్ల రూపాయలతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టగా ఇప్పటి వరకు సుమారు రూ.4 కోట్ల మేర పనుల జరిగాయన్నారు. మిగిలిన పనులు జరగాల్సి ఉందన్నారు.

అసంపూర్తిగా తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు

రహదారికి ఒకవైపు వేసిన సిమెంటు రోడ్డు

డంపింగ్ యార్డులుగా రోడ్డు, కాలువ గట్లు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, మనం మన పరిశుభ్రత, వ్యర్థాలపై వ్యతిరేక పోరాటంతోపాటు పారిశుధ్యంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మెరుగుపడటం లేదు. సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఆహ్లాదకంగా ఉండాల్సిన రహదారులు, కాలువ గట్లు డంపింగ్ యార్డులుగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో తాము వ్యాధుల బారిన పడుతున్నామనిస్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇవి కుక్కలకు, పందులకు, దోమలు. క్రిమికీటకాలకు అవాసాలుగా మారుతున్నాయి. స్థానిక బైపాస్ ఇందిరాగాంధీ రోడ్డులతో పాటు. మండలంలోని వెలగతోడు, తాపేశ్వరం, అర్తమూరు తదితర గ్రామాల్లో రోడ్ల, రాయవరం మండలంలోని సోమేశ్వరం ప్రధాన కాలువల వెంబడి ఉన్న చేత్తాచెదారాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక పెద్ద కాలువ వంతెన సమీపంలోను రహదారి వెంబడి చెత్తను వేయడంతోపాటు ఆ చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఆ రోడ్లపై ప్రయాణించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూతపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తెరిచి, చెత్తను అక్కడికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు. పచ్చదనం, పరిశు భ్రతను కాపాడే విధంగా అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సోమేశ్వరం వద్ద ప్రధాన రహదారి, కాలువ చెంతనే వేసిన చెత్త

మాసూళ్లు చేసిన పొలాలకు నిప్పు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పంట పొలాల్లో మాసూళ్లు పూర్తి చేసిన గడ్డిని రైతులు తగలబెడుతున్నారు. దీంతోకాలుష్యం పెరిగిపోవడంతో పాటు మంటల కారణంగా అధికంగా వేడి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వేడి మరింతగా ఇబ్బందిగా మారింది. పంట పొలాలు తగలబెట్టడం కారణంగా భూమిలోని అతి చిన్న సూక్ష్మజీవులు చనిపోయి సారం పోతుందని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. పొలంలోని మొళ్లు, గడ్డి తగల బెట్టడడం వల్ల రైతులకు ఏ ఉపయోగం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పొలంలో సూపర్ ఫాస్పేట్ వేసి దమ్ము చేస్తే దుబ్బులు, గడ్డి బాగా చివికి పోయి భూమిలో కలసి భూసారం పెరుగుతుందని అంటున్నారు.

మండపేట శివారు ప్రాంతాల్లో తగలబెడుతున్న పొలాలు